# కార్పొరేట్ స్థాయిలో పాలనా భవనాలు


పరకాల, అక్టోబర్ 12 : బీఆర్ఎస్ సర్కారు చొరవతో పరకాల పట్టణం అభివృద్ధి పథాన ముందుకు పోతున్నది. నాడు ఉమ్మడి పాలనలో పరకాల రెవెన్యూ డివిజన్ కల నెరవేరకపోగా తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. పరకాల రెవెన్యూ డివిజన్‌తో పాటు, పురపాలక సంఘం, తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలను తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో నిర్మించింది. రూ.4.8కోట్లతో మున్సిపాలిటీ భవనం, రూ.2.8కోట్లతో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, రూ.2.15కోట్లతో తహసీల్దార్ కార్యాలయాలను ఆధునిక వసతులతో నిర్మించగా, ఇటీవలే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. పరకాల రెవెన్యూ డివిజన్ కావడంతో పాటు కార్పొరేట్ తరహా సర్కారు పాలనా భవనాలు అందుబాటులోకి రావడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పరకాలలోని కొత్త మున్సిపాలిటీ కార్యాలయం



పరకాల తహసీల్దార్ కార్యాలయం






అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఎక్కడి నుంచైనా నిర్ణీత నమూనాలో SUVIDHA.ECI.GOV.IN ద్వారా నామినేషన్లు దాఖలు చేసే అవకాశాన్ని కల్పించింది. ఎన్నికల నోటిఫికే షన్ వెలువడిన తర్వాత నామినేషన్ల గడువు లోపల నిర్దిష్ట విధానంలో సాధారణ నామినేషన్ తరహాలోనే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంలో దశల వారీగా అభ్యర్థుల వివరాలు, వారి ఆస్తుల అఫిడవిట్ పత్రాలు, నిర్ధారిత నామినేషన్ డిపాజిట్, పది మంది బలపరచాల్సిన వారి వివరాలు సైతం ఇవ్వాలి. యాప్‌లో ముందుగా వచ్చిన వివరాలు నమోదు చేసిన తర్వాత వెంటనే ఇతర వివరాలు అడుగుతారు. అన్నింటిని సమర్పించిన తర్వాతనే నామినేషన్ దాఖలు చేసేందుకు ఉన్న నిర్ణీత సమయంలో స్లాట్ సమయాలను బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారిని నేరుగా కలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వివరాలతో కూడిన పత్రాలు మూడు సెట్లు అందించాల్సి ఉంటుంది. నామినేషన్ చివరి రోజులోగా వాటిని తప్పనిసరిగా అందించాలి. రిటర్నింగ్ అధికారికి నేరుగా అందిస్తేనే నామినేషన్ దాఖలు చేసినట్లుగా భావిస్తారు. తర్వాత నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు విషయంలో నేరుగా అభ్యర్థులు లేదా వారి తరపున ప్రతినిధులు హాజరు కావాల్సి ఉంటుంది.

# ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు


- సమర్పించేందుకు అందుబాటులో 'సువిధ' యాప్
- రూపొందించిన ఎన్నికల కమిషన్
- వివరాలను నమోదు చేసి నిర్ణీత సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి
- చివరి రోజు నేరుగా మూడు సెట్ల పత్రాలు అందించాలి

*మారుతున్న సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకునేలా ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్‌లోనూ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించేలా ఏర్పాటు చేసింది. ఈ మేరకు సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యాప్‌లో అన్ని వివరాలను నమోదు చేసి, నిర్ణీత సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. చివరి రోజు నేరుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మూడు సెట్ల పత్రాలు అందిస్తేనే నామినేషన్ దాఖలు చేసినట్లు భావిస్తారు.*

**- ములుగుటౌన్, అక్టోబర్12**

### లోటుపాట్లకు అవకాశం లేకుండా..

గతంలో దరఖాస్తు చేసేందుకు వెళ్తే నిర్ణీత పత్రాలు లేకపోతే తిరిగి పంపించేవారు. ఇప్పుడు అలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా ఆన్‌లైన్‌లో ముందస్తుగా దరఖాస్తు చేస్తే అవసరమైన పత్రాల సమాచారం అందరికీ తెలుస్తుంది. వీటన్నింటిని సిద్ధం చేసుకొని వెళ్లొచ్చు. ఆ తర్వాత రిటర్నింగ్ అధికారికి మూడు సెట్ల పత్రాలు అందించాల్సి ఉంటుంది. గతంలో నామినేషన్ పత్రాలు పూరించేందుకు అనుభవజ్ఞులను అభ్యర్థులు ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంతో విద్యావంతులు ఎవరైనా నిర్ణీత నమూనా ప్రకారం నామినేషన్లు సమర్పించొచ్చు.




- 'వర్కింగ్ ఆన్ ద ఫ్యూచర్' థీమ్‌తో నిర్వహణ
- ఆలయ విశిష్టతపై విశ్వవ్యాప్త ప్రచారం
- 33 దేశాల్లో 74చోట్ల.. దేశవ్యాప్తంగా 10చోట్ల కార్యక్రమం
- కొత్తగా ఎంపికైన వారసత్వ కట్టడాల్లో ఐదేళ్ల పాటు క్యాంపెయిన్
- ఈ సారి రామప్పలో 35 మందికి శిక్షణ
- చరిత్ర, సంస్కృతి, సంప్రదాయలపై అవగాహన.. నేడు ముగింపు



క్యాంపెయిన్‌లో వలంటీర్లు

# కాకతీయ ఖ్యాతి విశ్వవ్యాప్తం

## 11రోజులుగా పాలంపేటలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్



వెంకటాపూర్, అక్టోబర్ 12 : రామప్ప ఆలయ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు ఇక్కడ 11 రోజులుగా 'వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్'ను 'వర్కింగ్ ఆన్ ద ఫ్యూచర్' అనే థీమ్‌తో నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ, ఐకోమస్ ఇండియా, కేంద్ర పురావస్తు శాఖ, ఇంటాక్ సంస్థల సహకారంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగించారు. 33 దేశాల్లో 74 క్యాంప్‌లను ఏర్పాటు చేయగా, దేశవ్యాప్తంగా పది చోట్ల నిర్వహిస్తున్నారు. కొత్తగా ఎంపికైన వారసత్వ కట్టడాల గురించి ఆన్‌లైన్‌లో చరిత్ర, అర్కిటెక్ట్, సివిల్ ఇంజినీరింగ్, టూరిజం, ఆర్కియాలజీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి ఎంపికైన వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఆయా ప్రదేశాల చరిత్ర, ప్రత్యేకతలు, నిర్మాణశైలి, అప్పటి టెక్నాలజీ, సంస్కృతి, కళలు, గొప్పతనం, సంరక్షణ చర్యలు, స్థానిక జీవన విధానం, సంప్రదాయాల గురించి వివరించి వారితో తమ తమ ప్రదేశాల్లో ప్రచారం చేయిస్తారు. ఈ క్యాంపెయిన్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు నిర్వహిస్తున్నారు. మన దేశంలో రామప్పలో నిర్వహించే క్యాంపెయిన్ చివరిది. నివేదికను నవంబర్ 15 వరకు యునెస్కోకు సమర్పించనున్నారు. ఈ సారి 260 మంది దరఖాస్తు చేసుకోగా 40 మంది ఎంపికయ్యారు. 14 రాష్ట్రాలకు చెందిన 35 మంది వలంటీర్లు హాజరయ్యారు.




రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ క్యాంపెయిన్ ఫ్లెక్సీ

### 11 రోజులుగా కార్యక్రమం

ఈ నెల 2న పాలంపేటలో కార్యక్రమం ప్రారంభమైంది. వరుసగా పది రోజుల పాటు బయో ఇంజినీరింగ్, కాకతీయుల నిర్మాణశైలి, టెక్నాలజీ, రామప్ప చరిత్ర, సంస్కృతి, పురాతన కట్టాడాలకు ఎంచుకున్న మెటీరియల్స్, దేవాలయాలు, కల్చరల్ టూరిజం, కాకతీయుల కట్టాడాల ఆర్కిటెక్చర్, వారసత్వ కట్టడాల సివిల్ ఇంజినీరింగ్, రామప్పలోని సంప్రదాయ నృత్యం, కాకతీయుల కట్టాడాల ఏరియల్ వ్యూ, పునర్నిర్మాణం, తెలంగాణలోని కాకతీయుల కట్టడాలు, రామప్ప ఆలయం యునెస్కో గుర్తింపులో టూరిజం శాఖ పాత్ర, వారసత్వ కట్టాడాల అభివృద్ధి, పునర్నిర్మాణాలు, బిల్డింగ్ కెపాసిటీ, పాలంపేట స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకతీయల గొలుసుకట్టు చెరువులు, రామప్ప ప్రపంచ వారసత్వ హోదా రావడంపై ఐకోమస్ పాత్ర, ఇందుకు పురావస్తు శాఖ డైరెక్షన్ తదితర అంశాలపై తరగతులు నిర్వహించారు. వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, పాండవుల గుట్ట, కోటగుళ్లు, మేడారం, లక్నవరాన్ని సందర్శించారు. భారతీయ నృత్యాల చరిత్ర, పేరిణి నృత్య ప్రదర్శన, కొమ్ము కోయ నృత్య ప్రదర్శనతో పాటు రోజూ ఉదయం యోగా శిక్షణ తీసుకున్నారు. త్రికూటాలయాన్ని శ్రమదానం చేసి ముస్తాబు చేశారు. నేడు ముగింపు కార్యక్రమం నిర్వహించనుండగా టూరిజం ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, రిటైర్డ్ ఐఏఎస్ బీపీ ఆచార్య తదితరులు హాజరుకానున్నారు.



### కాకతీయుల ఖ్యాతి విశ్వవ్యాప్తం కోసం..

వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ 2023 క్యాంపు భవిష్యత్తు కోసం పని అనే థీమ్‌తో నిర్వహించాం. దీని ద్వారా వలంటీర్లకు కాకతీయుల నిర్మాణశైలి, నాటి టెక్నాలజీ, నిర్మాణానికి వాడిన పరికరాలు, మెటీరియల్స్, నీటి పారుదల వ్యవస్థ, సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాల విశిష్టత, నీటి నిల్వల గురించి వివరించాం. కాకతీయుల నీటిపారుదల వ్యవస్థ నేటికీ అనుసరణీయమని, దీన్ని ప్రపంచ వ్యాప్తం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం.

**- శ్రీధర్‌రావు, కాకతీయ ట్రస్టు సభ్యుడు**



### టూరిజం హబ్‌గా ములుగు

కేయూ టూరిజం స్కాలర్ అయిన నేను గతేడాది వలంటీర్స్ శిక్షణ తీసుకున్న. ఈ సంవత్సరం వలంటీర్స్‌కు ఇన్‌చార్జిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ కార్యక్రమం ద్వారా దేశ విదేశాల్లో ప్రచారంతో ములుగు జిల్లా టూరిజం హబ్‌గా మారనుంది.

**- కొక్కుల ప్రశాంత్, కేయూ టూరిజం స్కాలర్, వలంటర్స్ కో ఆర్డినేటర్**




### చెప్పుకోండి

1. 'భువన విజయం' ఎవరి ఆస్థానం?
2. సౌరవ్యవస్థలో ఆస్టరాయిడ్లు ఏయే గ్రహాల మధ్య ఉన్నాయి?
3. ఇత్తడి.. ఏయే లోహాల సమ్మేళనం?



### పూరించండి



_at _lbow

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

### పదసృష్టి




కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Everybody

Ex : Body

### పెద్దల మాట



కళ్లకు రెప్పలు ఉన్నట్టే.. పనికి విశ్రాంతి ఉండాలి.

- రవీంద్రనాథ్ ఠాగూర్

### జవాబులు

చెప్పుకోండి : 1. శ్రీకృష్ణదేవరాయలు, 2. అంగారకుడు – బృహస్పతి, 3. రాగి, జింకు.

పూరించండి : EAT, ELBOW


# చిన్నచూపు

**ధర్మారం** గ్రామంలో ఈశ్వరప్ప అనే పెద్ద రైతు ఉండేవాడు. తన భూమిలో మంచి దిగుబడిని ఇచ్చే పంటను పండించేవాడు. గ్రామంలో తెలివైన రైతుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. దాంతో అతనిలో గర్వం పెరిగిపోయింది. తనకంటే ఎక్కువ దిగుబడి సాధించడం ఎవరితరమూ కాదని ప్రగల్భాలు పలికేవాడు. మిగతా రైతులను చిన్నచూపు చూసేవాడు. అంతేకాదు, తోటి రైతులు ఎవరైనా సహాయం కోసం తన దగ్గరికి వస్తే.. వారిని సూటిపోటి మాటలతో బాధించేవాడు. అంతేకాకుండా చెరువు నుంచి వచ్చే నీటిని ఇతరుల పొలాల్లోకి వెళ్లకుండా చేసేవాడు. ఇలా ఉండగా.. ఈశ్వరప్ప ఒకరోజు అర్ధరాత్రి తన పొలం దగ్గర కాపలా ఉన్నాడు. ఆ సమయంలో అతణ్ని ఓ తాచుపాము కాటేసింది. కాసేపట్లోనే నోటి నుంచి నురుగలు కక్కుకుంటూ కిందపడిపోయాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పక్కపొలం రైతు జరిగినదంతా గమనించాడు. కేకవేసి ఇంకొంతమంది రైతులను పిలిచాడు. అంతా కలిసి హుటాహుటిన ఈశ్వరప్పను దగ్గర్లోని దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స అందించారు. సరైన సమయంలో తీసుకొచ్చారనీ, ప్రాణాపాయం ఏమీ లేదని చెప్పారు. స్పృహలోకి వచ్చిన ఈశ్వరప్ప.. తనను కాపాడిన రైతులకు కృతజ్ఞతలు చెప్పాడు. "మీరు చిన్నరైతులని మిమ్మల్ని ఈసడించుకున్నాను. అవేవీ మనసులో పెట్టుకోకుండా నాకు ప్రాణభిక్ష పెట్టారు. ఈ మేలు ఎప్పటికీ మరువలేను!" అంటూ వారికి చేతులెత్తి నమస్కరించాడు. అప్పటి నుంచి ఈశ్వరప్ప ఊరివాళ్లందరితో కలిసి మెలిసి ఉండసాగాడు. వ్యవసాయంలో రైతులకు తగిన సలహాలు ఇవ్వసాగాడు.

**నీతి :** ఎంత గొప్పవారు అయినా.. గర్వం పనికిరాదు.


- **యాడవరం చంద్రకాంత్ గౌడ్**

కథ




### జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com

### రైమ్ టైమ్



Hot cross buns!
Hot cross buns!
One a penny,
two a penny.
Hot cross buns!
If you have no
daughters,
Give them to
your sons!
One a penny,
two a penny.
Hot cross buns!

### చిట్టి క్యాన్వాస్





వి. అభిరత్, జనగాం.

### టంగ్ ట్విస్టర్స్

Cooks cook cupcakes quickly.

